# పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

బజార్లో పనిముగించుకుని నాకు తెలిసిన ఓ స్టెయిన్‌లెస్ స్టీల్ షాపుకి వెళ్ళాను. ఆ షాపు ఓనరు నన్ను చూసి విష్ చేసి కూర్చోమని కుర్చీ చూపాడు. అతనితో పెద్దగా పరిచయం ఏంలేదు. మా అమ్మాయి బారసాలకు పంచడానికి స్టీలు వస్తువులు ఆ షాపులో కొన్నాను. ఆ తర్వాత రెండురోజులకు అతనికి ఏదో లోన్ అవసరమయ్యి మా బేంక్‌కి వచ్చాడు. అప్పటినుండి నన్ను ఎక్కడ చూసినా విష్ చేస్తాడు. వీలయితే కూల్‌డ్రింకో, టీయో ఇప్పిస్తాడు.

"ఏమిటి సార్? ఇలా వచ్చారు?" అని ప్రశ్నించాడు అతను.

"బజారు పనిమీద వచ్చాను. పని పూర్తయింది. అలా మీ షాపుకొచ్చి మిమ్మల్ని చూసి పోదామని...." అన్నాను.

"చాలా సంతోషం! ఈ రోజు మా అతిథి మీరు." అంటూ వెంటనే కూల్‌డ్రింక్ తీసుకు రమ్మని కుర్రాణ్ణి పంపాడతను.

ఇంతలో ఎవరో ఏవో కొనటానికి వస్తే "ఒక్క నిమిషం" అంటూ వారికి ఏవో స్టీలు సామాన్లు చూపించాడు. వారు కొన్నింటిని సెలక్ట్ చేశారు. రేటు సెటిల్‌అయి డబ్బు చెల్లించిన తర్వాత వాళ్ళు వెళ్ళిపోబోతుంటే "ఆగండి! ఆ వస్తువుల మీద మీ పేరు వేస్తాను ఇవ్వండి" అంటూ మిషన్ తీసి వేశాడు.

ఆ తర్వాత మరెవరో ఏదో ఫంక్షనుందని పంచడానికి చాలా ఎక్కువ సంఖ్యలో స్టీలు సామాన్లు తీసుకున్నారు. వారికి అన్ని వస్తువుల మీద ఓపికగా "ప్రెజెంటెడ్ బై" అని వారి పేరు మిషన్‌తో రాశాడు.

అలా నేను అక్కడ కూర్చున్న కొద్దిసేపటిలో అమ్మిన అన్ని వస్తువులకీ పేర్లు వేసి మరీ అమ్మాడు.

ఆ తర్వాత అతను నా దగ్గరికి వచ్చినప్పుడు "నేను ఒకటడుగుతాను. మరేం అనుకోకుండా జవాబు చెబ్తారా?" అన్నాను.

"మీరడగడం నేను చెప్పకపోవడమూనా? అడగండి" అన్నాడు.

"మరేంలేదు. మీరు స్టీలు వస్తువులు ఎందరికో అమ్ముతున్నారు కదా. ప్రతి వస్తువుకి పేరు రాయకుండా ఇవ్వడం లేదేం? వారు మరచిపోయినా అక్కర్లేదంటున్నా ఎక్కువ సంఖ్యలో కొన్నా పేరు రాయకుండా ఇవ్వలేదు. పేరు రాయకుండా ఇస్తే మీకు ఏదైనా నష్టముందా?" అన్నాను.

దానికతను నవ్వుతూ "మీరు గొప్ప ఇబ్బంది పెట్టే ప్రశ్నే అడుగుతున్నారు. అయినా జవాబు చెబ్తాను. మేము మా దగ్గర వస్తువుకొన్న ప్రతి ఒక్కరికీ పేరు రాసి ఇవ్వడంవల్ల మాకు లాభమే కలుగుతుంది. ఒకసారి పేరు రాసిచ్చిన వస్తువును తిరిగి వాపసు తీసుకోం కదా! ఆ విధంగా దానిని వారు తీసుకురావడం, మార్చమని కోరడం తప్పుతుంది. అంతేకాదు! మేము ప్రక్కషాపులో కంటే ఏదైనా ఎక్కువరేటుకి అమ్మామనుకోండి! వాళ్ళు భోగట్టా చేసి తిరిగొచ్చి వస్తువు తీసుకోమ్మన్నా, నచ్చలేదు మరొకటి మార్చమన్నా మార్చే అవసరం తప్పుతుంది. ఇవన్నీ లాభాలే కదా? వస్తువు కొన్నవాళ్ళు పేరు రాసి ఇస్తున్నామని సంతోషిస్తారు కాని ఇవన్నీ ఆలోచించరు" అంటుంటే అసలు విషయం అప్పుడర్థమైంది నాకు! ◆

—నారంశెట్టి ఉమామహేశ్వరరావు

గెద్దలుప్పి - 532 546
సీతానగరం (వయా) బొబ్బిలి (తా॥)
విజయనగరం (జిల్లా)

స్రవంతి నెం: 22లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి
రచయిత్రి : కాజ హనిత
పెట్టిన పేరు : తేలు కుట్టిన దొంగ

---

స్రవంతి నెం. 20లో ఇచ్చిన "ఇది నాలుగోసారి! ఈసారి చూసినా నీ ఆత్మహత్యా ప్రయత్నానికి నేనడ్డురాను" అన్నాడు శాయి లక్ష్మితో.

**వాక్యం ఆధారంగా రాసిన కథలు**

## రివర్స్ షాట్

"వాట్? ఆత్మహత్యలో ఉన్న థ్రిల్‌ను అనుభవించడానికి వచ్చావా?" అని ప్రశ్నించాడు శాయి.

"ఇంతకీ నీ పేరేంటి, అమ్మాయి?"

"లక్ష్మి."

"చూడమ్మా లక్ష్మి, లైఫ్‌ని ఎంజాయ్ చేయాలి కాని, పిరికిపందలా ఆత్మహత్య చేసుకోకూడదు. అయినా ఆత్మహత్య మహా పాపం..." ఇలా ఆ అమ్మాయికి నచ్చచెప్పి పంపించాడు. ఒక నిండు ప్రాణిని నిలబెట్టానన్న తృప్తితో ఇంటి మొఖంపట్టాడు.

టాంక్‌బండ్‌పై కూర్చుని, సరదాగా చుక్కలు లెక్కపెడ్తున్న శాయి, తనకు పది అడుగుల దూరంలో ఎవరో ఉన్నట్టు గమనించాడు. ఎవరో తెలుగింటి ఆడపడుచు? ఆత్మహత్య కేస్ అయి ఉంటుంది? ఏం కష్టం వచ్చిందో? పాపం!!

పరీక్షగా చూశాడు. "ఆ అమ్మాయే!" అతని కళ్ళు అగ్నిగోళాల్లా మారిపోయాయి. చరాచరా ఆమె దగ్గరకు వెళ్ళి, "ఇది నాలుగోసారి? ఈసారి చూసినా నీ ఆత్మహత్యా ప్రయత్నానికి నేనడ్డు రాను తక్షణం ఇక్కడనుంచి వెళ్ళిపో" అంటూ విసురుగా ఆ అమ్మాయిని తోసాడు శాయి.

"ఏంటయ్యా నీ గోలా? నెల రోజుల నుంచి చూస్తున్నాను. వచ్చిన ప్రతిసారి, నేనేదో ఆత్మహత్య చేసుకుంటున్నానని అడ్డుపడతావ్. చేస్తున్న దరిద్రపు వృత్తిని మరచిపోయి, వారానికి ఒకసారి ప్రశాంతంగా గడుపుదామనుకుంటే, నువ్వొచ్చి నా మనసు పాడుచేస్తావ్? ఇంకోసారి ఇలా చేసావంటే పోలీసులకు పట్టిస్తా. జాగ్రత్త! అయినా ఈ మధ్య రోడ్‌సైడ్ రోమియోలు ఎక్కువైపోయారు." అంటూ విసావిసా ఆమె వెళ్ళిపోతుంటే తన చెవుల్ని - కళ్ళనీ నమ్మలేక ఆమెవైపే చూస్తూ నిల్చున్నాడు శాయి. ◆

—టి. రాజు

1-8-133, బాలసముద్రం
హనుమకొండ - 506 001,
వరంగల్లు (జిల్లా)

## మనసుంటే మార్గం

బావిలోకి దూకబోతున్న లక్ష్మి, శాయి బలంగా భుజాలుపట్టి ఆపడంతో వెనుదిరిగి అతణ్ణి కౌగిలించుకొని వెక్కివెక్కి ఏడవ సాగింది.

శాయి మొహంలో ఏ భావమూలేదు... "లోపలికి పద" అన్నాడు. ఏడ్పు ఆపి అతణ్ణోసారి చిత్రంగా చూసి, మౌనంగా అతడిని అనుసరించింది.

"ఇది నాలుగోసారి. ఈసారి చూసినా, నీ ఆత్మహత్యా ప్రయత్నానికి నేనడ్డురాను" అన్నాడు శాయి, లక్ష్మితో.

లక్ష్మిలోని దుఃఖం చెలియలికట్ట దాటి ఉద్భృతమయింది.

'మరి ఇప్పుడు మాత్రం ఎందుకొచ్చారు' వెక్కిళ్ళమధ్య అడిగింది. జాలిగా చూశాడామెవంక శాయి.